క్లుప్తంగా

శ్రీనివాసా.. గోవిందా



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

బిక్కవోలు: బలభద్రపురంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు వేకువ జాము నుంచే స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులందరికీ అన్నసమారాధన నిర్వహించినట్టు ఆలయ కమిటీ సభ్యుడు నల్లమిల్లి రామచంద్రారెడ్డి (రాము) తెలిపారు. అలాగే కొంకుదురు, పందలపాక, బిక్కవోలు, కొమరిపాలెం గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఘనంగా భవానీల పడిపూజ



పందలపాకలో పడి పూజ చేస్తున్న భవానీ మాలధారులు

బిక్కవోలు: పందలపాక వెలంపేట ఆలయం సమీపంలోని శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం రాత్రి పడిపూజ నిర్వహించారు. గురు భవాని పంపన గోవిందు ఆధ్వర్యంలో సుమారు 200 మంది భవానీలు, స్వాములు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జగన్మాతకు ఇంటి నైవేద్యం

రాజానగరం: శరన్నవరాత్ర ఉత్సవాలలో భాగంగా చక్రద్వారబంధం దేవీచౌక్‌లో జగన్మాతకు గ్రామస్తులు శనివారం సాయంత్రం ఇంటి నైవేద్యం సమర్పించారు. సుమారు 200 మంది భక్తులు తమ ఇంట తయారు చేసిన ప్రసాదాన్ని నైవేద్యంగా చెల్లించారు. ఈ విధంగా నైవేద్యాలు చెల్లించిన భక్తుల పేర్లను డ్రా తీసి రూ. 3 వేలు, రూ. 2 వేలు, రూ. ఒక వెయ్యి చొప్పున బహుమతులుగా ఆలయ నిర్వాహకులు అందజేశారు.

పారిశుధ్య పనుల పరిశీలన



స్వచ్ఛతా ర్యాలీ నిర్వహిస్తున్న సత్యనారాయణరెడ్డి తదితరులు

పెదపూడి: గ్రామాల్లో చెత్త సేకరణ క్లాప్‌మిత్రలు బాధ్యతగా చేపట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన శనివారం గంగ్రేడులో క్లాప్ మిత్రలు చేస్తున్న చెత్త సేకరణ, పారిశుధ్య చర్యలను పనులు పరిశీలించారు. స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి ఎం.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలు స్వయం అభివృద్ధి సాధించాలి



ఆంజనేయులు

పెదపూడి: గ్రామ పంచాయతీలు స్వయం సమృద్ధి, అభివృద్ధి సాధించాలని మండల రిసోర్స్ పర్సన్, రామేశ్వరం గ్రామ సచివాలయం కార్యదర్శి భోగరాజు ప్రసన్న ఆంజనేయులు అన్నారు. గ్రామ పంచాయితీ సొంత వనరుల పెంపుదలపై రెండ్రోజులుగా స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సచివాలయం కార్యదర్శులు, సర్పంచులకు నిర్వహిస్తున్న శిక్షణ శనివారంతో ముగిసింది. ఇన్‌చార్జి ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ప్రసన్న ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు ఇంటి, కుళాయి పన్నులు, లైసెన్సు ఫీజులు, భవన నిర్మాణ అనుమతులు, పచ్చగడ్డి, కొబ్బరి చెట్లు ఫలసాయం, చేపల చెరువుల వేలం పాటలు తదితర ఆదాయ వనరులు పెంపొందించుకోవాలన్నారు.

బిక్కవోలు: పంచాయతీల ఆదాయ వనరులను పెంచేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఇస్తున్న రెండు రోజుల శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఇంటి పన్నులు, నాన్ ట్యాక్స్‌ల ఆదాయాన్ని పెంచుకోవడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పరిపాలనా అధికారి నాగేంద్ర ప్రసాద్, ఈవోపీఆర్డీ జాన్ మిల్టన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల జంక్షన్లు



దివాన్ చెరువు కూడలిలో వాహనాల రద్దీ



ఇటీవల జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వాహనం (ఫైల్)

- కూడళ్లలో ట్రాఫిక్ రద్దీ
- తరచూ ప్రమాదాలు

రాజానగరం: పెరుగుతున్న జనాభాతో పాటు వారు ప్రయాణించే వాహనాల సంఖ్య కూడా ఎక్కువవుతుండడంతో రహదారులపై విపరీతమైన రద్దీ ఏర్పడుతోంది. ముఖ్యంగా జాతీయ రహదారిపై తరచూ ట్రాఫిక్ జామ్‌లు నెలకొంటున్నాయి. కూడలి (జంక్షన్లు) ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉంటుంది. వాహనాల రద్దీకి అనుగుణంగా జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించారు. అయితే ఈ విస్తరణలో కూడలి ప్రాంతాల మధ్య దూరం ఎక్కువగా పెట్టడంతో ప్రయాణికులు, వాహనాల రాకపోకలు అధికమై రద్దీగా మారుతున్నాయి. నియోజకవర్గ పరిధిలో 18 కిలోమీటర్ల మేర విస్తరించిన జాతీయ రహదారిపై తూర్పుగానుగూడెం, ఏడీబీ రోడ్డు, వైఎస్సార్ విగ్రహం, సూర్యారావుపేట, గైట్ కళాశాల, దివాన్ చెరువు వద్ద జంక్షన్లు ఉన్నాయి. గామన్ బ్రిడ్జికి వెళ్లే జీరో పాయింట్ వద్ద కూడా ట్రాఫిక్ రద్దీ ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతాలలో మోరంపూడిలో మాదిరిగా జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పలు ప్రమాదాలు

జాతీయ రహదారిపై దివాన్ చెరువు, సూర్యారావుపేట, రాజానగరం, ఏడీబీ రోడ్డు, తూర్పుగానుగూడెం జంక్షన్ల వద్ద గడచిన తొమ్మిది నెలల్లో జరిగిన ప్రమాదాలను పరిశీలిస్తే ఈ ప్రాంతాలలో ఫ్లైఓవర్ల అవసరం ఎంత ఉందో తెలుస్తుంది. ఈ ఐదు చోట్ల గత తొమ్మిది నెలలలో 12 మంది మృత్యువాత పడగా, 26 మంది గాయాలపాలయ్యారు. దివాన్‌చెరువు కూడలి నుంచి ఇటు శ్రీరామపురం, పుణ్యక్షేత్రం, అటు పాలచర్ల, నిడిగట్ల ప్రాంతాలకు, రాజానగరం కూడలి నుంచి అటు నరేంద్రపురం, ఇటు గ్రామంలోకి, సూర్యారావుపేట జంక్షన్ నుంచి పెట్రోలుకు, వెలుగుబంద, ఏడీబీ రోడ్డు జంక్షన్ నుంచి కలవచర్ల, కాకినాడ ఏడీబీ రోడ్డుకు వెళ్లేందుకు క్రాస్ రోడ్లు ఉన్నాయి. దీనితో ఈ రోడ్ల నుంచి వచ్చే ప్రయాణికులు జాతీయ రహదారిపై వేగంగా వచ్చే వాహనాలతో ఇబ్బందులు పడటమే కాకుండా తరచు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ప్రాంతాలలో కళాశాలలు, పాఠశాలలు ఉండడంతో విద్యార్థులను తీసుకువెళ్లే బస్సులతో ఉదయం, సాయంత్రం వేళ్లలో విపరీతమైన రద్దీ ఏర్పడుతోంది. దివాన్ చెరువు కూడలిలో ఉదయం, సాయంత్రం వేళలో బొమ్మూరు పోలీసులు ఒకరిద్దరు గస్తీ ఉన్నా వాహనాల రద్దీని నియంత్రించలేక పోతున్నారు. ఇక మిగిలిన ప్రాంతాలలో పోలీసుల జాడే ఉండదు.

పండ్ల మార్కెట్ నుంచి జీరో పాయింట్ వరకూ..

దివాన్ చెరువులో జీరో పాయింట్ నుంచి పండ్ల మార్కెట్ ఏరియా వరకు ఫ్లైఓవర్ నిర్మించాల్సి ఉంది. ఇప్పటికే ఈ ప్రాంతంలోని పండ్ల మార్కెట్ వద్ద అనధికారికంగా ఏర్పాటు చేసిన డివైడర్ కటింగ్ ప్రమాదాలకు తావిస్తోంది. దీనిని గుర్తించిన సంబంధిత అధికారులు ఒకసారి మూయించివేసినా, పలుకుబడి కలిగిన స్థానికులు మరలా రీ ఓపెన్ చేశారు.

చర్యలు తీసుకోవాలి

> జాతీయ రహదారిపై ఏలూరు నుంచి కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల వైపు ప్రతి గ్రామ కూడలి వద్ద ఫ్లైఓవర్లు నిర్మించారు. రాజమహేంద్రవరం నుంచి జగ్గంపేట వైపు ఎందుకనో వాటి అవసరాన్ని అధికారులు విస్మరిస్తున్నారు. జంక్షన్ల వద్ద ప్రయాణికులకు ఎదురవుతున్న సమస్యలను, ప్రమాదాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఫ్లైఓవర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని గుర్తించి చర్యలు తీసుకోవాలి.
>
> – డాక్టర్ కనకరాజు, రామస్వామిపేట

మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి పూజలు



రామవరంలో మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



అనపర్తిలో వీరుళ్లమ్మను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు

అనపర్తి: దేవీ నవరాత్రులను పురస్కరించుకుని రామవరం చెరువు వీధిలో కొలువైన అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ నల్లమిల్లి సూరారెడ్డి, వేద పండితులు చల్లపల్లి త్రిమూర్తులు శర్మ ఆలయ కమిటీ సభ్యులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దంపతులను ఆలయ కమిటీ తరపున కమిటీ చైర్మన్, సభ్యులు వేద పండితులు సత్కరించారు. కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి, నల్లమిల్లి వెంకటరెడ్డి (మేస్త్రి), సబ్బెళ్ల అమ్మిరెడ్డి, గొలుగూరి సూరెడ్డి, కర్రి గాంధీ రెడ్డి, కర్రి గోపాల్ రెడ్డి, కర్రి రాంప్రసాద్ రెడ్డి, నల్లమిల్లి మణికంఠ రెడ్డి పాల్గొన్నారు.

వీరుళ్లమ్మ సన్నిధిలో..

అనపర్తి: నియోజకవర్గ కేంద్రమైన అనపర్తిలో గ్రామ దేవత వీరుళ్లమ్మను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు శనివారం సందర్శించారు. గురు భవాని వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో భవానీ మాలధారులు వారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పీఠంలో పడాల రామారెడ్డి, ఇందిరా దంపతులు ఏర్పాటు చేసిన భిక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైభవంగా వారాహి అమ్మవారి గ్రామోత్సవం



జి.మామిడాడలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలోని మణికంఠ స్వామి ఆలయ ప్రాంగణంలో అక్టోబర్ 2వ తేదీ విజయ దశమి రోజు వారాహి అమ్మవారికి ప్రాణప్రతిష్ఠ చేయనున్నారు. దీనిలో భాగంగా శనివారం అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సత్తి భగవాన్ రెడ్డి మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే ప్రాణప్రతిష్ఠ చేయనున్న ఏకైక వారాహి అమ్మవారి ఆలయం ఇదే అన్నారు. ఈ మేరకు రెండ్రోజుల పాటు గ్రామం, పరిసర ప్రాంతాల్లో గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. అనంతరం ఈ నెల 30న ప్రాణప్రతిష్ఠకు సంబంధించి యజ్ఞం, హోమాలు, పూజలు జరుగుతాయన్నారు. అక్టోబర్ 2వ తేదీ ఉదయం 9.42 గంటలకు ప్రాణప్రతిష్ఠ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు మండ రాజారెడ్డి, గురుస్వామి డీఆర్‌కే రెడ్డి, ద్వారంపూడి యువరాజారెడ్డి, సబ్బెళ్ల మోహన్‌రెడ్డి, డీవీ కృష్ణారెడ్డి, వెంకటకృష్ణారెడ్డి(చిన్న గురువు), ద్వారంపూడి కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

బిక్కవోలు: పందలపాకలోని పడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ పాఠశాలలో 1992 నుంచి 1997 వరకూ ఆరు నుంచి పదో తరగతి వరకూ చదువుకున్న విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. దాదాపు 28 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారందరూ ఒకరినొకరు పరిచయం చేసుకుని, పాత జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. ముందుగా పాఠశాల ఏర్పాటు చేయడానికి కృషి చేసిన పడాల కృష్ణారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతి చెందిన ఆనాటి గురువులు, తోటి విద్యార్థులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. తమకు చదువు చెప్పిన గురువులు కోనాల సత్తిరాజు, పులగం వెంకటరెడ్డి, వైబీఎస్ ఆచార్యులు, పిచ్చిక సురేష్, పడాల గెరటా రెడ్డి, సుబ్బారెడ్డి, కుమారిలను ఘనంగా సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడి చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శేషారెడ్డి, విజయ్, గోవిందు, బాజ్జీ, పీటీ రావు, సత్యనందారెడ్డి, రామకృష్ణ, స్వప్న, స్వాతి, సురేఖ, రేణుక, రామలక్ష్మి, కళ్యాణి, అన్నపూర్ణ, విద్యావతి పాల్గొన్నారు. అలాగే ఈ కార్యక్రమానికి సహకారం అందించిన పాఠశాల హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డిని సత్కరించారు.

జయములివ్వు జగజ్జనని



వడిశలేరులో విజయదుర్గమ్మ

రంగంపేట: జయములివ్వు జగజ్జనని అంటూ భక్తులు ఆ జగన్మాతను భక్తిశ్రద్ధలతో పూజిస్తున్నారు. దసరా మహోత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయాలు, మండపాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. రంగంపేట దేవీ సెంటర్, స్థానిక ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవారిని శనివారం లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. చంద్రేడులోని కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. దొంతమూరు, ఈలకొలను, వడిశలేరు తదితర గ్రామాల్లో వైభవంగా పూజలు జరిగాయి.

అనపర్తి: పాత ఊరిలోని తురక వీధి సెంటర్‌లో అమ్మవారు లలితా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు, భవానీ మాలధారులు తరలివచ్చి పూజలు నిర్వహించారు.

సీతానగరం: బొబ్బిల్లంకలోని అయ్యప్పస్వామి ఆలయం ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. సింగవరం పరిధి నాగరత్నం కాలనీ, ముగ్గళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బిక్కవోలు: స్థానిక గోలింగేశ్వరస్వామి ఆలయంలో కొలువైన పార్వతీ దేవిని బాలా త్రిపుర సుందరిగా అలంకరణ చేశారు. పందలపాక, కొమరిపాలెం, బలభద్రపురం, కొంకుదురు, తొస్సిపూడి, ఆరికరేవుల గ్రామాల్లో ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

యూరియా కోసం తప్పని పాట్లు



సీతానగరం గ్రోమోర్ సెంటర్ వద్దకు యూరియా కోసం వచ్చిన రైతులు

సీతానగరం: మండలంలోని రైతులకు యూరియా పాట్లు తప్పడం లేదు. సీతానగరంలోని గ్రోమోర్ రిటైల్ సెంటర్‌కు శనివారం మండలం నుంచి చాలామంది రైతులు యూరియా కోసం వచ్చారు. గతంలో ఆ సెంటర్‌లో ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు మాత్రమే యూరియా బస్తాలు అందిస్తున్నారు. ఇలా రోజుకు కేవలం 8 నుంచి 10 మంది రైతులకు మాత్రమే ఒక్క బస్తా చొప్పున ఇస్తున్నారు. అలాగే బయోమెట్రిక్ ద్వారా అందించడంతో రైతులు వేలిముద్రలు వేయాల్సి వస్తుంది. ఐతే నెట్ లేకపోవడం, వేలిముద్రలు సరిగ్గా పడకపోవడం తదితర సమస్యలు వేధిస్తున్నాయి. కాగా.. మండలంలో సొసైటీలకు వంద మెట్రిక్ టన్నుల యూరియా శనివారం వచ్చిందని మండల వ్యవసాయశాఖాధికారి ఎ.గౌరీదేవి తెలిపారు. చినకొండేపూడి, కూనవరం, ముగ్గళ్ల సొసైటీలకు ఒకొక్క దానికి 20 మెట్రిక్ టన్నులు, రామచంద్రపురం, మునికూడలి, ములకల్లంక సొసైటీలకు ఒకొక్క దానికి 13 టన్నుల చొప్పున అందించామన్నారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం



సుభద్రంపేట వైద్య శిబిరంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాంబాబు

రంగంపేట: మహిళల ఆరోగ్య పరిరక్షణే కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమ లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. సుభద్రంపేటలోని సచివాలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ మహిళల్లో వచ్చే అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కాగా.. శిబిరంలో 175 మంది మహిళలకు బీపీ, షుగర్, హెచ్‌బీ పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అవసరమైన మహిళలకు సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్, ఓరల్ క్యాన్సర్ స్క్రీనింగ్, బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించి తగు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వి.తులసీదాస్, పీహెచ్ఎన్ కె.మేరీ హెలేనా, ఎంపీహెచ్ఎస్ కె.రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఈఆర్‌సీపీలో 96 మంది వైద్యులకు ఫెలోషిప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రముఖ వైద్యులు, మెడికోలు

రాజానగరం: స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలలో ఫెలోషిప్ ఆఫ్ ది ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ గ్యాస్ట్రో ఇంటెస్టినల్ ఎండోసర్జన్స్ (ఎఫ్ఏజీఐఈ) వర్క్‌షాప్ శనివారం జరిగింది. దేశంలోని లాప్రోస్కోపిక్, ఎండోస్కోపిక్ సర్జన్లకు ఇచ్చే ఈ ప్రతిష్టాత్మక శిక్షణలో ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీతో పాటు తొమ్మిది రాష్ట్రాల నుంచి 19 మంది ప్రాక్టీసింగ్ సర్జన్లు, సర్జరీలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేస్తున్న 77 మంది మెడికోలు పాల్గొన్నారు. ఈఆర్‌సీపీ ప్రొసీజర్లలో నిపుణులైన ఈశ్వర మూర్తి, సతీష్ కుమార్ మిదా, సి.సిద్దేష్, అరుణ్ కార్యంపూడి, గన్ని భాస్కరరావు, సమీర్ రంజన్ నాయక్, వేగుళ్ల వెంకట ముఖేష్ మార్గదర్శకత్వంలో ఆరు థియేటర్లలో చేసిన 36 ఆపరేషన్లను లైవ్ చూపించారు. ఈ శిక్షణలో ఎండోస్కోపిక్ రెట్రోగ్రేడ్ కొలాంజియోపాంక్రియాటోగ్రఫీ (ఈఆర్‌సిపి) టెక్నిక్స్ పై అవగాహన కల్పించారు.

ఈఆర్‌సీపీ అంటే..

కాలేయం, పిత్తాశయం, క్లోమ గ్రంథులకు సంబంధించిన సంక్లిష్ట సమస్యలను గుర్తించి చికిత్స చేయడానికి ఉపయోగించే ప్రత్యేకమైన ఎండోస్కోపిక్ విధానాన్నే ఈఆర్‌సీపీ అంటారు. దీని ద్వారా పిత్తాశయంలో రాళ్లను తొలగించడం, క్యాన్సర్ గడ్డలను గుర్తించడం, జాండిస్ వంటి సమస్యలకు కారణమయ్యే అడ్డంకులను తొలగిస్తారు. ఇది అత్యంత నైపుణ్యంతో కూడిన ప్రక్రియ. ఏ చిన్నపొరపాటు జరిగినా క్లోమం వాపు (పాంక్రియాటైటిస్) వంటి తీవ్రమైన సమస్యలు తలెత్తే ప్రమాదం 5 నుంచి 10 శాతం వరకు ఉంటుంది. ఈ కారణంగానే ఈ విధానంలో వైద్యులకు నిరంతరం శిక్షణ, నైపుణ్యాభివృద్ధి అవసరం.

ఫెలోషిప్ ప్రత్యేకత

సాధారణంగా వైద్యులు పీజీ (ఎండీ/ఎంఎస్) పూర్తి చేసిన తరువాత ఒక నిర్దిష్ట విభాగంలో మరింత లోతైన, ఉన్నత స్థాయి నైపుణ్యం సంపాదించడం కోసం చేసే ప్రత్యేక శిక్షణనే ఫెలోషిప్ అంటారు. ఈ క్రమంలో ఫెలోషిప్ ఆఫ్ ది ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ గ్యాస్ట్రో ఇంటెస్టినల్ ఎండోసర్జన్స్ (ఎఫ్ఏజీఐఈ) అనేది లాప్రోస్కోపిక్, ఎండోస్కోపిక్ సర్జన్లకు ఇచ్చే ఒక ప్రతిష్టాత్మక ఫెలోషిప్. దీని ద్వారా వైద్యులు క్లిష్టమైన ఆపరేషన్లను సురక్షితంగా, సమర్థవంతంగా చేయగల నైపుణ్యం, ఆత్మవిశ్వాసాన్ని పొందుతారని కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ గన్ని భాస్కరరావు వివరించారు.

సొసైటీని లాభాల బాటలోకి తీసుకువస్తాం



బూరుగుపూడిలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ నాగ కేశవరావు

కోరుకొండ: బూరుగుపూడి సొసైటీని లాభాల బాటలోకి తీసుకువెళతానని పీఏసీఎస్ చైర్ పర్సన్ కంటే నాగ కేశవరావు అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడి సొసైటీలో శనివారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 560 మంది సభ్యులున్న సొసైటీ రూ.17.50 కోట్ల టర్నోవర్‌తో నడుస్తోందన్నారు. అయితే రుణాలు అందజేయడం, వాటిని వసూలు చేయకపోవడంతో నష్టాల ఊబిలో కూరుకుపోయిందన్నారు. దీన్ని లాభాల్లోకి తీసుకువెళ్లడానికి సీఎస్‌సీ ద్వారా విస్తృత సేవలు అందించాలని, గతంలో నిర్వహించిన వాటర్ ప్లాంట్‌ను పునఃప్రారంభించాలని, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని, సిబ్బందిని ఏర్పాటు చేయాలని సమావేశం తీర్మానించింది. సమావేశంలో పర్సన్లు బాలిన వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి సూర్యనారాయణ, సీఈవో ఈదల సుదర్శనరావు, రైతులు అడపా శ్రీను, అనదాసు సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

గాడాలలో నూతన భవనం నిర్మించాలి

గాడాల సొసైటీకి పక్కా భవనం నిర్మించేందుకు కృషి చేస్తున్నట్టు చైర్ పర్సన్ పడాల మోహనరావు తెలిపారు. గాడాలలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.కోటి అప్పులతో సొసైటీ ఉందన్నారు. రూ.10 లక్షల బకాయిలు వసూలు చేశామని, వివిధ రకాల విస్తృత సేవలు అందించేందుకు ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు. సమావేశంలో పర్సన్లు తిరుమలనాథుని వెంకటేశ్వరరావు, సీఈవో ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవిని అవమానించినా మౌనమేనా!

- ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డివి స్వార్థ రాజకీయాలు
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



అనపర్తి: అసెంబ్లీలో మాజీ ఎంపీ, ప్రముఖ సినీ నటుడు చిరంజీవిని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అవమానకరంగా సంబోధిస్తే అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మౌన ముద్ర వహించడం విస్మయం కలిగించిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి పార్టీ కార్యాలయంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. రామకృష్ణారెడ్డి ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నారంటే దానికి ప్రధాన కారణం చిరంజీవి, ఆయన సోదరుడు కల్యాణ్, వారి సామాజికవర్గం ఓట్లేనన్నది జగమెరిగిన సత్యమన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, చిరంజీవిలపై అధికారిక ధ్రువీకరణ పత్రం కలిగి ఉన్న సైక్రియాట్రిక్ పేషెంట్ బాలకృష్ణ అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి సెంటిమెంట్లు ఉండవని, కేవలం స్వార్థ ప్రయోజనాలే ఉంటాయని ఈ సంఘటన సాక్ష్యంగా నిలిచిందన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

బిక్కవోలు: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా కొంకుదురు గోపాల రామానాయుడు వీధిలో శనివారం చండీహోమం నిర్వహించారు. అర్చకులు రమణ శర్మ, భాస్కర్ శర్మ ఆధ్వర్యంలో దంపతులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు జరిపారు. అనంతరం అన్నసమారాధన చేశారు. బాలభక్త సమాజం కమిటీ సభ్యులు చిన్నం శ్రీనివాసరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

సారా తరలిస్తున్న ఇద్దరి అరెస్టు



నిందితులతో ఎక్సైజ్ సీఐ సుధ తదితరులు

బిక్కవోలు: మండలంలోని రంగాపురంలో 20 లీటర్ల సారా తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు రంగంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సుధ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన యాదల రాంబాబు, మాదబోయిన రాముడిని అరెస్ట్ చేశామన్నారు.

ఇనుగంటివారిపేటలో చోరీ

సీతానగరం: ఇనుగంటివారిపేటలోని చొంగ దుర్గాప్రసాద్ ఇంటిలో రూ.2.10 లక్షలు చోరీకి గురయ్యాయని ఎస్సై డి.రామ్ కుమార్ శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. దుర్గాప్రసాద్ రావులపాలెంలోని ఫెర్టిలైజర్ షాపులో పని చేస్తుంటాడు. పది రోజులకు ఒకసారి ఇనుగంటివారిపేట తన ఇంటికి వస్తుంటాడు. అతడికి గల రెండు పోర్షన్ల ఇల్లు ఉండగా, ఒక దానిలో నాన్నమ్మ ఉంటున్నారు. ఆమె శుక్రవారం రాత్రి అదే గ్రామంలోని వేరే ఇంటిలో నిద్రించింది. కాగా శనివారం ఉదయం దుర్గా ప్రసాద్‌కు పెదనాన్న కుమార్తె ఫోన్ చేసి.. మీ ఇంటి తలుపులు పగలుకొట్టి ఉన్నాయని చెప్పింది. దీంతో దుర్గాప్రసాద్ ఇంటికి వచ్చి చూడగా బీరువాలోని రూ.1.60 లక్షలు, నానమ్మ ఉంటున్న పోర్షన్‌లో రూ.50 వేలు మాయమయ్యాయి. ఈ మేరకు బాధితుడు సీతానగరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. క్లూస్ టీమ్ ఘటనా స్థలంలో ఆధారాలను సేకరించింది.

అకిరా మియాకి మొక్కలతో పర్యావరణ రక్షణ

రాజానగరం: పర్యావరణ పరిరక్షణలో భాగంగా అకిరా మియాకి మొక్కల పెంపకం చేపట్టడం మంచి ఆలోచన అని కలెక్టర్ కీర్తి చేకూరి కొనియాడారు. రాజానగరంలో 25 సెంట్ల విస్తీర్ణంలో చేపట్టిన అకిరా మియాకి మొక్కల పెంపకం, ఫామ్ పాండ్, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను శనివారం సాయంత్రం ఆమె పరిశీలించారు. నీటి నిల్వలను సమృద్ధిపర్చడంలో ఫామ్ పాండ్స్ ఆవశ్యకత ఉందన్నారు. లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ విధానంపై క్షేత్ర స్థాయిలో సమీక్షించారు. 25 సెంట్ల విస్తీర్ణంలో జామ, వెంగం, బిల్లా, మర్రి, నర్ర గిలగిల, మద్ది, తామర, మందార, దేవదారు, తులసి, వేప, గంధం, తగర, తదితర మొక్కలను 2970 వరకు నాటామని ఎంపీడీఓ ఝాన్సీ వివరించారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ రాంప్రసాద్, తహసీల్దారు జీఏఎల్ఎస్ దేవి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ సత్యవతి, టెక్నికల్ ఇంజినీర్ బాలరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.